నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఆసిఫాబాద్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

మంచిర్యాలలో ఓటుహక్కు వినియోగించుకున్న యువతులు

మంచిర్యాలలోని జడ్పీ బాలుర పాఠశాలలో ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన మహిళలు

ఓటుహక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆయన కుమారుడు విజిత్‌రావు

పోలింగ్ ప్రశాంతం

- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్స్, ఎస్పీలు
- ఉదయం నుంచే బారులుదీరిన ఓటర్లు
- మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసిన ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లు



మంచిర్యాల, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాలతో కూడిన కరీంనగర్ ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్‌లతోపాటు పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థుల మద్దతుదారులు పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్ ఏర్పాటు చేసుకుని ఓటర్లకు పోలింగ్ స్లిప్పులు అందజేసి సహకరించారు. నిర్మల్ జిల్లావ్యాప్తంగా 1,966 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 1,601 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీచర్ ఎమ్మెల్సీకి సంబంధించి 81.43 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే జిల్లాలో 17,141 మంది గ్రాడ్యుయేట్లు ఉండగా, వీరిలో 11,374 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల పోలింగ్ శాతం 66.36గా నమోదైంది. ఉపాధ్యాయ ఓటర్ల కోసం 19, గ్రాడ్యుయేట్ల కోసం 27 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది, పట్టభద్రుల స్థానానికి 56 మంది పోటీ పడ్డారు. ఎవరు మెజారిటీ ఓట్లను దక్కించుకుని విజేతలుగా నిలుస్తారో మార్చి 3వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపులో తేలనున్నది.

కలెక్టర్ పరిశీలన

నిర్మల్, ఖైరంసా, ఖానాపూర్ పట్టణాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో అప్పటికే క్యూలో ఉన్నవారిని ఓటింగ్‌కు అనుమతించారు. సాయంత్రం 5 గంటల వరకు దాదాపుగా అన్ని కేంద్రాల్లో పోలింగ్ ముగియగా, ఒక్క సారంగాపూర్ పోలింగ్ కేంద్రంలో మాత్రం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. జిల్లా కేంద్రంలోని రోడ్లు, భవనాల ఇంజినీరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. కడెం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కూడా పరిశీలించారు. లోకేశ్వరం మండల కేంద్రంలోని జడ్‌పీఎస్‌ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 68వ నంబరు పోలింగ్ కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) కిశోర్ కుమార్ తనిఖీ చేశారు. అలాగే స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియం సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

ఆదిలాబాద్ జిల్లాలో..

ఆదిలాబాద్ జిల్లాలో 1,593 మంది ఉపాధ్యాయ ఓటర్లు, 14,935 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ఉదయం 10 గంటల వరకు ఉపాధ్యాయ ఎన్నికల పోలింగ్ 16.47 శాతం నమోదు కాగా, పట్టభద్రుల పోలింగ్ 7.84 శాతం, మధ్యాహ్నం 12 గంటల వరకు ఉపాధ్యాయుల పోలింగ్ శాతం 43.25, పట్టభద్రుల పోలింగ్ శాతం 23.02, మధ్యాహ్నం 2 గంటల వరకు ఉపాధ్యాయుల పోలింగ్ శాతం 75.33, పట్టభద్రుల పోలింగ్ శాతం 44.09 నమోదు అయింది. కలెక్టర్ రాజర్షి షా ఆదిలాబాద్ పట్టణంతోపాటు ఇంద్రవెల్లి, గుడిహత్నూర్ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

మంచిర్యాల-ఆసిఫాబాద్ జిల్లాల్లో..

మంచిర్యాల జిల్లాలో టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు 1664 మంది ఉంటే, 1474 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాదాపు 88.58 శాతం పోలింగ్ నమోదైంది. ఇక పట్టుభద్రుల ఓటర్లు 30,921 ఉండగా , 18,701 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాదాపు 60.48శాతం పోలింగ్ నమోదైంది. అలాగే కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లు 470 మంది ఉండగా, 424 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాదాపు 90.21 శాతం పోలింగ్ నమోదైంది. ఇక పట్టుభద్రుల ఓటర్లు 6137 మంది ఉండగా , 4546 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాదాపు 74.08 శాతం పోలింగ్ నమోదైంది.

చింతలమానేపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ ఏఎస్పీ ప్రభాకర్ రావు, పోలీసు అధికారులు

లక్షెట్టిపేట : పట్టణంలోని ప్రభుత్వ జడ్పీ బాలికల పాఠశాలలో పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం సీపీ శ్రీనివాస్

మూడో యూనిట్‌కు అనుమతులు

మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు

జైపూర్, ఫిబ్రవరి 27: ఎన్టీపీపీలో మరో 800 మెగావాట్ల సామర్థ్యం గల మూడో యూనిట్ ఏర్పాటుకు అన్ని అనుమతులు వచ్చినట్లు ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఎన్టీపీపీలో మూడో యూనిట్ ఏర్పాటుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సివిల్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, ఆపరేషన్ మెయింటనెన్స్, ఫారెస్ట్ వర్క్స్‌కు సంబంధించిన అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ప్రతి ఒక్కరి సలహాలు, సూచనలు తీసుకోవడమేగాకుండా ప్రణాళిక ప్రకారం కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. 800 మెగావాట్ల యూనిట్ ఏర్పాటు కోసం స్థలాన్ని సైతం పరిశీలించినట్లు చెప్పారు. అన్ని అనుమతులు లభించిన నేపథ్యంలో త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్‌ఆఫ్‌వోఅండ్‌ఎం జైన్‌సింగ్, ఏజీఎం సివిల్ ప్రసాద్, ఏజీఎం ఫైనాన్స్ సుధాకర్, ఏజీఎం ఈఅండ్‌ఎం మదన్‌మోహన్, ఎస్‌వోటూ ఈడీ ప్రభాకర్, కోఆర్డినేటర్ వేణుగోపాల్, ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్ సిబ్బంది తుకారాం తదితరులు పాల్గొన్నారు.

మహాప్రస్థానంలోని శివుడి విగ్రహానికి పూజలు చేస్తున్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

నస్పూర్‌లోని ఓ పాఠశాలలో బుధవారం రాత్రి కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని డబ్బులు పంచుతున్న నాయకులు

తీగల్‌పహాడ్ పోలింగ్ బూత్ సమీపంలో బీజేపీ- కాంగ్రెస్ నాయకులను చెదరగొడుతున్న పోలీసులు

హస్తం ఇష్టారాజ్యం

- మీడియాలో వార్తలొచ్చినా పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న మహాప్రస్థానంలో పూజలు ఎలా?
- ఇది కోడ్ ఉల్లంఘన కిందకు రాదా? అంటూ ప్రశ్నిస్తున్న నెటిజన్లు
- ఓట్లకు డబ్బులు పంచుతూ మీడియా కంటపడిన పాఠశాలపై చర్యలు శూన్యం
- పోలింగ్ కేంద్రంలోకి పరిధి దాటి వెళ్లడంతోనే గొడవ
- చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కోడ్ ఉల్లంఘన

మంచిర్యాల, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'మంచిర్యాలలో మాకు నచ్చింది చేస్తాం.. నిబంధనలు పట్టించుకోం.. మాకు ఏ నిబంధనలు వర్తించవు..' అన్నట్లుగా ఉంది అధికార పార్టీ తీరు. ప్రజాభీష్టం పేరిట విధ్వంసం చేయడం.. ఏ పని చేసినా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేసి విమర్శల పాలవడం ఆ పార్టీకే చెల్లింది. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ.. దానిని అతిక్రమిస్తూ అధికార పార్టీ వ్యవహరించడం విమర్శలకు తావిస్తున్నది. మంచిర్యాల గోదావరి రోడ్‌లో రూ.11 కోట్లతో నాలుగు ఎకరాల స్థలంలో మహాప్రస్తానం(శ్మశాన వాటిక) నిర్మాణం చేపట్టారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. శ్మశాన వాటికలోని శివుడి విగ్రహానికి శివరాత్రి పండుగను పురస్కరించుకుని బుధవారం ఎమ్మెల్యే పీఎస్‌ఆర్ దంపతులు పూజలు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయద్దు. కానీ.. మంచిర్యాలలో మాత్రం మహాప్రస్తానంలో శివుడి విగ్రహానికి పూజలు ఎలా చేస్తారంటే.. ఇది ప్రారంభోత్సవం కాదు కేవలం పూజలు చేస్తున్నామంటూ చెప్పుకొచ్చారు. రూ.11 కోట్ల ప్రభుత్వ నిధులతో చేపట్టిన నిర్మాణంలో ప్రారంభోత్సవం చేయకుండా పూజలు ఎలా చేస్తారు? ఇది ఎలక్షన్ కోడ్ కోడ్ ఉల్లంఘనలోకి రాదని ఎలా చెప్తారు? ఇలా చేయొచ్చని ఏ చట్టంలో ఉంది? ఎన్నికల సంఘం ఎక్కడైనా ఇలా చెప్పిందా? ఇది కచ్చితంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలోకే వస్తుంది. జిల్లా అధికారులు అన్ని తెలిసి కూడా ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తుంటే చూస్తూ ఊరుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సొమ్ము ఒకరిది.. సోకు మరొకరిది..

మహాప్రస్తానం శ్మశాన వాటిక నిర్మించడం మంచి విషయమే. కానీ.. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా అధికారికంగా ప్రారంభించని మహాప్రస్తానంలో శివుడి విగ్రహానికి పూజలు నిర్వహించే అధికారం ఎమ్మెల్యేకు ఎక్కడిది అంటూ అధికార పార్టీ నాయకులే గుసగుసలాడుకుంటున్నారు. రూ.11 కోట్లు ప్రభుత్వ నిధులు కాదా? ఆ పని చేపిస్తున్నది ప్రభుత్వమైనప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రుల ఫొటోలు లేకుండా ఫ్లెక్సీలు కొట్టించి ప్రచారం చేసుకోవడం ఏంటని పెదవి విరుస్తున్నారు. ప్రోటోకాల్ పాటించకుండా.. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని తెలిసినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా కేవలం వ్యక్తిగత రాజకీయ మెప్పు కోసం.. హడావుడిగా శివుడి విగ్రహానికి పూజలు చేశారనే విమర్శలు వస్తున్నాయి. సొమ్ము ఒకరిది.. సోకు ఒకరిది అన్న చెందంగా పరిస్థితి మారిపోయిందంటూ కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే అంటే పడని సీనియర్లు మండిపడుతున్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా పూజలు చేయడం, శిశుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు ప్రచారం చేయడంపై చర్యలు తీసుకోవాల్సిందే అంటున్నారు. ఇలా కోడ్ ఉల్లంఘన కిందకు రాదో కలెక్టర్ సమాధానం చెప్పాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

పాఠశాలపై చర్యలేవీ?

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మేలు చేసేలా నస్పూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ట్రస్మా(తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) నాయకులు ఓటర్లకు డబ్బులు పంచుతూ రెడ్‌హ్యాండెడ్‌గా మీడియాకు దొరికారు. పాఠశాల బయటి నుంచి లోపల డబ్బులు పంచుతున్న సదరు ట్రస్మా నాయకుల ఫొటోలు, వీడియాలో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మీడియాను చూసి ఎక్కడికి అక్కడ సర్దుకుని, కాసేపటికి పాఠశాలకు లాక్ చేసుకుని వెళ్లిపోయిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. మీడియాలోనూ ఈ వ్యవహారంపై ప్రముఖంగా వార్తా కథనాలు ప్రచురితమయ్యాయి. కానీ.. జిల్లా అధికారులు ఆ పాఠశాలపై గానీ, డబ్బులు పంచిన ట్రస్మా నాయకులపై చర్యలు తీసుకోలేదు. అధికార పార్టీ అభ్యర్థికి సంబంధించిన వ్యవహారం కావడంతోనే జిల్లా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదనే విమర్శలు వస్తున్నాయి. ఇక ఇదే నస్పూర్‌లోని తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్‌లోనూ ఎన్నికల కోడ్ ఉల్లంఘన విషయంలోనే బీజేపీ-కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య వాగ్వాదం తలెత్తినట్లు తెలుస్తున్నది. ఇక్కడ అధికార పార్టీ నాయకులు కోడ్ ఉల్లంఘించి, నిర్దేశించిన పరిధి దాటి వెళ్లి ప్రచారం చేశారని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. పోలీసులు అధికార పార్టీకి సహకరిస్తూ మా పార్టీ లీడర్‌పై దాడి చేశారంటూ, పోలింగ్ బూత్ లోపల ప్రచారం నిర్వహించినట్లు అసత్యాలు చెప్తున్నారంటూ ఆ పార్టీ నాయకులు రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఇవేవి పట్టనట్లు, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు తమకు ఎలాంటి సంబంధం లేదన్నట్లు జిల్లా అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారులు అధికార పార్టీకి అంటకాగడంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామంటున్నారు.

కల్యాణ వైభోగం..

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో 15 జంటలకు ఉచిత వివాహాలు
- మంగళ సూత్రాలు, మట్టెలు, పట్టువస్త్రాలు అందించి ఆశీర్వాదం
- అతిథులందరికీ భోజనం



సిర్పూర్(యూ) : వివాహాలు జరిపిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

సిర్పూర్(యూ), ఫిబ్రవరి 27 : మండలంలోని మహగాం శివాలయం సామూహిక వివాహాలకు వేదికైంది. గురువారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో 15 జంటలకు అంగరంగ వైభవంగా వివాహాలు జరిపించారు. యేటా నిర్వహిస్తున్నట్లే ఈ యేడాది కూడా ఉచితంగా మంగళసూత్రాలు, మట్టెలు, పట్టువస్త్రాలు అందించి పెళ్లిళ్లు జరిపించి ఆశీర్వదించారు. అతిథులందరికీ భోజనం పెట్టారు. కాగా, యేటా మహాశివరాత్రిని పురస్కరించుకొని మహగాంలోని సంత్ సూరోజీ బాబా మందిరం ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వివాహాలు జరిపించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మర్సుకోల సరస్వతి, సురోజీబాబా పీఠాధిపతి మెస్రం కైలాష్, జైనూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, నాయకులు హన్ను పటేల్, తొడసం భాగ్యలక్ష్మి, తొడసం ధర్మరావు, భూపతి, శంకర్, ఆడే లక్య, భీంరావుస్వామి, సార్మేడి ఆనంద్‌రావు, విశ్వంబర్, సీతారాం పాల్గొన్నారు.

మహదేవ్ మందిరంలో పూజలు

మహదేవ్ మందిరంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జాతరలో పర్యటించి వ్యాపారులతో ముచ్చటించారు. కబడ్డీ పోటీలు వీక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు మర్సుకోల సరస్వతి, మాజీ ఎంపీపీలు ఆత్రం భగవంత్‌రావు, తొడసం భాగ్యలక్ష్మి, తొడసం ధర్మరావు, జాతర కమిటీ నాయకులు గోవింద్‌రావు, దౌలత్‌రావు, కుంర భీంరావు ఉన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి..

జైనూర్, ఫిబ్రవరి 27 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా జైనూర్ మండలం పట్నాపూర్‌లోని శ్రీశ్రీశ్రీ పరమ హంస సద్గురు పూలాజీబాబా సంస్థానములో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పూలాజీ బాబా సతీమణి ఇంగ్లే దుర్పతాబాయి, పూలాజీ బాబా తనయులు కేశవ్ ఇంగ్లే, వామన్ ఇంగ్లే చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి పూజలు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సంస్థానము ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థాన అధ్యక్షుడు కేశవ్ ఇంగ్లే, గౌరవ అధ్యక్షుడు వామన్ ఇంగ్లే, డుక్రె సుభాష్, భగవంత్‌రావ్, మాగాడే దాదారావ్, మాజీ సర్పంచ్ బాలాజీ ఖండారె,కుంర కేశవ్, బీఆర్ఎస్ నాయకులు భీంరావ్,సతీశ్ ముండే సమాధాన్, మారు, సభ్యులు గిరె సుధామ్,ఆత్రం రాము పాల్గొన్నారు.

పెద్దపులి సంచారం

హాజీపూర్, ఫిబ్రవరి 27 : మండలంలోని గుడిపేట, నంనూర్, ముల్కల్ల గ్రామ పంచాయతీ శివారులోని అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గురువారం తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతేగాకుండా మేకలు, పశువుల కాపరులు అటవీ వైపు వెళ్లవద్దని, కరెంటు తీగలు వేయరాదని హెచ్చరించారు.

చదువుతోనే జీవన శైలిలో మార్పు

కాసిపేట, ఫిబ్రవరి 27 : చదువుతోనే జీవన శైలిలో మార్పు వస్తుందని జిల్లా వయోజన విద్యా శాఖ ప్రాజెక్ట్ అధికారి పురుషోత్తం నాయక్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి కాసిపేట మండల కేంద్రంలోని విజయ లక్ష్మి అక్షరాస్యత కేంద్రం, కుట్టు శిక్షణ కేంద్రాలను పరిశీలించారు. శివరాత్రి పండుగను పురస్కరించుకొని అక్షర శివరాత్రి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చదువు నేర్చుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని, సంతకాలు నేర్చుకున్నంత మాత్రాన అక్షరాస్యులుగా పరిగణించబడరని, కనీసం పదాలు రాయడం, చదవడం, చిన్న చిన్న లెక్కలు చేయడం వచ్చినప్పుడే అక్షరాస్యులుగా గుర్తించబడుతారన్నారు. వంద శాతం అక్షరాస్యతగా తీర్చి దిద్దాలని కలెక్టర్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని మార్చి 30వ తేదీ లోగా అందరూ చదవడం, రాయడం నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. సెక్టోరల్ ఆఫీసర్ సత్య నారాయణమూర్తి చదువు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అభ్యాసకులను చదివించి వారి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం డీఆర్పీ బండ శాంకరి, కళాకారులు తిరుపతి, కృష్ణ, భూమమ్మ ఆటాపాటలతో శివ భజన చేశారు. ప్రతిభ కనబరిచిన భూమమ్మను సన్మానించారు. డీఆర్పీలు అశోక్ రావు, సుమన్ పాల్గొన్నారు.